



న్యూ ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. చిత్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రూ.2లక్షల లోపు పంట రుణాలన్నింటినీ ఒకే దఫా మాఫీ చేసి, రైతులకు విముక్తి కలిగిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో బ్యాంకు అధికారులు సైతం వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు 'కట్-ఆఫ్-డేట్'గా ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ మధ్యకాలంలో రుణాలు తీసుకున్న రైతుల వివరాలు సేకరిస్తున్నారు.

చిగురించిన ఆశలు!

రుణమాఫీ ప్రకటనతో జిల్లా వ్యాప్తంగా రైతుల హర్షాతిరేకాలు

- రైతు రుణమాఫీకి ప్రభుత్వ నిర్ణయం
- వివరాల సేకరణలో అధికారుల నిమగ్నం
- విధివిధానాలు ప్రకటించగానే అర్హుల జాబితా ప్రకటించనున్న లీడ్ బ్యాంక్ అధికారులు
- 2023 డిసెంబరు 9కి ముందున్న రుణాలన్నీ మాఫీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

నిజామాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి. క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ అవుతాయని రైతులు భావిస్తున్నారు. ఆగస్టు నుంచే రుణమాఫీ మొదలవుతుందని ప్రకటించడంతో రైతులు ఎదురు చూస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులతో పాటు ఓ మోస్తరు రైతులకు రుణాలు కూడా మాఫీ కానుండటంతో ఈ పథకం కింద జిల్లాలోని రైతులకు మేలు చేకూరనుంది. రుణమాఫీ కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల వరకు రుణమాఫీ అవుతుండటంతో కొంతమేరకు భారం తీరనుంది. రుణమాఫీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో బ్యాంకు అధికారులు కూడా కసరత్తు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా వివరాలు తీసుకుంటూనే బ్యాంకుల వారీగా రూ.2లక్షలలోపు ఉన్న రైతుల వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేయగానే జిల్లాలో ఎంత మంది రైతులకు మాఫీ అవుతుందో ప్రకటించనున్నారు.

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హామీ

అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. సన్న, చిన్నకారు రైతులతో పాటు ఇతర రైతులకు సంబంధించిన రూ.2లక్షలలోపు రుణాన్ని మాఫీ చేస్తామని నేతలతో పాటు మంత్రులు ప్రకటించారు. ఈ మధ్యలోనే జరిగిన క్యాబినెట్ సమావేశంలో కూడా రుణమాఫీపై నిర్ణయం తీసుకున్నారు. విధివిధానాలు ఖరారు చేసి ప్రకటించడంతో పాటు అన్ని జిల్లాల పరిధిలో రైతులు తీసుకున్న రూ.2లక్షలలోపు రుణాలను మాఫీ చేయనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లాలోని రైతులకు పెద్ద భారం తీరనుంది. గత ప్రభుత్వ హయాంలో ఏకకాలంలో రుణమాఫీ లక్ష రూపాయలలోపు చేయకపోవడం వల్ల భారం భారీగా పెరిగింది. వడ్డీతో పాటు అసలు కట్టకపోవడం వల్ల ఎక్కువ మొత్తంలో పేరుకుపోయింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రకటించడం వల్ల రైతులు కూడా చెల్లించలేదు. దీంతో బ్యాంకుల్లో ఎక్కువ మొత్తంలో రుణాలు పేరుకుపోయాయి. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పాటు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయనున్నారు. క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించిన ప్రకారం డిసెంబరు 12, 2018 నుంచి డిసెంబరు 9, 2023 లోపు పంట రుణాలు తీసుకున్న రైతులకు ఈ రుణమాఫీని వర్తింపజేయనున్నారు.

జిల్లాలో సుమారు 2లక్షల మంది రుణ గ్రహీతలు

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో సన్న, చిన్నకారు రైతులు మొత్తం కలిపి 2లక్షల 67వేల వరకు ఉన్నారు. ఈ మధ్యనే పట్టాలు పొందిన వారు మరికొంత మంది పెరిగారు. ఈ రైతులకే రైతుబంధు రెండు విడతల్లో జమ చేస్తున్నారు. వీరిలో సన్న, చిన్నకారు రైతులతో పాటు మధ్య, పెద్ద రైతులు ఉన్నారు. వీరంతా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నారు. వీరిలో కొంత మంది రుణాలను చెల్లించగా మరికొంత మంది రుణాలను మాఫీ అవుతుందని వేచి చూస్తున్నారు. కొంత మంది రైతులు సీజన్‌ల వారీగా రుణాలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు బ్యాంకులకు చెల్లిస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం రైతుబంధు పొందే రైతుల్లో దాదాపు 70 శాతానికి పైగా పంట రుణాలు తీసుకున్న రైతులు ఉన్నారని అంచనా వేస్తున్నారు. వీరిలో సరాసరి లెక్కల ప్రకారం 2లక్షలకు పైగా రైతులు రుణమాఫీకి అర్హులయ్యే అవకాశం ఉందని బ్యాంకు అధికారులతో పాటు వ్యవసాయ అధికారులు అంచనాకు వస్తున్నారు. వీరికి సంబంధించిన రుణాలు సుమారు రూ. 1800 కోట్ల నుంచి 2వేల కోట్ల మధ్య మాఫీ అయ్యే అవకాశం ఉందిన అంచనాకు వస్తున్నారు. జిల్లాలో ప్రోగ్రెసీవ్ రైతులు ఉండటం ఎక్కువ మొత్తంలో పంటలు తీయడం వల్ల రుణాలను కూడా బ్యాంకుల నుంచి తీసుకుంటున్నారు. పెట్టుబడులు పెట్టి పంటలు రాగానే చెల్లింపులు చేస్తున్నారు. క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం నుంచి విధివిధానాలు ఖరారు చేసి మార్గదర్శకాలు విడుదల చేయగానే జిల్లాలోని బ్యాంకు అధికారులు పూర్తిస్థాయి వివరాలను ప్రకటించనున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఐదు సంవత్సరాలలోపు విడతల వారీగా చేయడం వల్ల రైతులకు రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు రైతులు తీసుకున్న రుణాలకు సంబంధించి వడ్డీకే సరిపోయింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా రుణమాఫీ అవుతే సన్న, చిన్నకారు రైతులకు పెట్టుబడి భారం తగ్గడంతో పాటు మాఫీ వల్ల కొంత ఊరట ఉంటుందని రైతు సంఘాల నేతలు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున బ్యాంకుల వారీగా 2లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతుల వివరాలను సేకరిస్తున్నామని లీడ్ బ్యాంక్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం మార్గదర్శకాలు రుణమాఫీపై విడుదల చేయగానే దానికి అనుగుణంగా ఎంతమంది అర్హులో నివేదిక తయారు చేయడంతో పాటు ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు.



పెంటాఖుర్దులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

నిజామాబాద్ అర్బన్, జూన్ 24: ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలలో మొత్తం 11,429 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 57.38 శాతం ఉత్తీర్ణతతో 6,559 మంది పాస్ అయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 10,270 మంది పరీక్ష రాయగా, 58.39 శాతం ఉత్తీర్ణతతో 5,997 మంది పాస్ అయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 1159 మంది పరీక్షలు రాయగా 562 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలలో మొత్తం 7,052 మంది పరీక్షలు రాయగా 52.86 శాతం ఉత్తీర్ణతతో 3,728 మంది పాస్ అయ్యారు. అందులో జనరల్ విద్యార్థులు 6,074 మంది పరీక్షలు రాయగా, 54.11 శాతం ఉత్తీర్ణతతో 3,287 మంది పాస్ అయ్యారు. వొకేషనల్ విద్యార్థులు మొత్తం 978 మంది పరీక్షలు రాయగా 441 మంది పాస్ అయ్యారు. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలలోనూ ఉత్తీర్ణతలో బాలికలే పైచేయి సాధించారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్, జూన్ 24: పాలిసెట్-2024 ప్రవేశాల కోసం మొదటి విడత కౌన్సెలింగ్ కొనసాగుతోంది. సోమవారం మూడో రోజు కౌన్సెలింగ్‌కు 415 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా సమన్వయకర్త శ్రీరాంకుమార్ తెలిపారు. మంగళవారంతో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తవుతుందని సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం విద్యార్థులు తప్పనిసరిగా వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 27 వరకు వెబ్ ఆప్షన్ల గడువు ఉంటుందని ఇతర వివరాలకు టిజిపాలిసెట్.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న బడాపహాడ్ హుండీ లెక్కింపు

బోధన్‌రూరల్, జూన్ 24: ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద పవిత్ర పుణ్యక్షేత్రం బడాపహాడ్ (పెద్దగుట్ట)హుండీ లెక్కింపు ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. పాత టెండర్ గడువు ముగియడం, ఎన్నికల కోడ్ అమలుకారణంగా రెండు నెలల పాటు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్వహణ బాధ్యతలను స్థానిక వక్ఫ్‌బోర్డు సిబ్బందికి అప్పజెప్పారు. దీంతో వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని ఆదేశాల మేరకు బడాపహాడ్ ఇన్‌చార్జి సద్దాం, సూపరింటెండెంట్ జమాల్ ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు సిబ్బంది, పోలీసు బందోబస్తు మధ్య హుండీ లెక్కింపు కొనసాగుతోంది. మొత్తం నాలుగు హుండీల్లో భక్తులు వేసిన రూ.500నుంచి 10వరకు నగదు, వెండి, బంగారం, చిల్లర డబ్బుల కానుకలను వేర్వేరుగా లెక్కిస్తున్నారు. మొదటి హుండీ లెక్కింపు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉందని వక్ఫ్‌బోర్డు సిబ్బంది తెలిపారు. రెండు నెలల హుండీ ఆదాయం సుమారు రూ.30లక్షలకు పైగా సమకూరనుందని భావిస్తున్నారు. హుండీ లెక్కింపు పూర్తయిన అనంతరం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సిబ్బందికి అప్పజెప్పనున్నట్లు సూపరిండెంట్ జమాల్ తెలిపారు.

బీసీజీ సర్వేను నిలిపివేయాలి..

నగరంలోని ధర్నాచౌక్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు



పెద్దబజార్, జూన్ 24: ఆశావర్కర్లకు పారితోషకం లేని బీసీజీ (బాసిల్లస్ కాల్మెట్ గ్యురిన్)సర్వేను నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ధర్నా చౌక్ వద్ద తెలంగాణ ఆశావర్కర్ల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్తగా ప్రవేశ పరీక్ష పెట్టే విధానం రద్దు చేయాలని ఫిక్సిడ్ వేతనం 18వేల రూపాయలు నిర్ణయించాలన్నారు. ఆశా కార్యకర్తలు 19 ఏళ్లుగా గ్రామాలు, బస్తీలో తిరుగుతూ ఆరోగ్య సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక, ఉపాధ్యక్షురాలు సుకన్య, స్వప్న, రేవతి, రేణుక, విజయ, లలిత, సలీమ, చంద్రకళ పాల్గొన్నారు.



తప్పుల సవరణకు తెరుచుకున్న సైట్లు

- ప్రజాపాలన దరఖాస్తుల వివరాల నమోదులో పొరపాట్లు
- డాటా ఎంట్రీ ఆపరేటర్ల నిర్లక్ష్యానికి అర్హుల అవస్థలు
- వేలాది మందికి అందని ఆరు గ్యారంటీ పథకాల ఫలితాలు
- ఎన్నికల కోడ్ ముగియడంతో దిద్దుబాటుకు అధికారుల చర్యలు

బోధన్‌రూరల్, జూన్ 24: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల కింద లబ్ధిపొందేందుకు అర్హులనుంచి జనవరిలో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. అయితే దరఖాస్తుదారుల వివరాల నమోదు చేసే క్రమంలో డాటా ఎంట్రీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తప్పులు దొర్లాయి. దీంతో వేలాది మంది అర్హులకు ఆరు గ్యారంటీ పథకాలు అందలేకపోయాయి. ఈ క్రమంలో తప్పుల సవరణకు అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ పెరిగింది. కానీ లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దరఖాస్తుల వివరాల నమోదు సవరణకు అవకాశం లేకుండా పోయింది. ఇటీవల ఎన్నికలతోపాటు కోడ్ ముగియడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

పకడ్బందీగా దరఖాస్తుల స్వీకరణ

ఆరు గ్యారంటీల కింద అర్హుల నుంచి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత ఏడాది డిసెంబరు 28నుంచి జనవరి 6వరకు దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గం, మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారుల బృందాలను ఏర్పాటు చేసి ఎంతో పకడ్బందీగా స్వీకరణ ప్రజా పాలన గ్రామ సభలను పూర్తి చేశారు. ఆ తర్వాత కూడా దరఖాస్తులు అందజేసేందుకు కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతుభరోసా తదితర పథకాల కోసం ఆశావహులు భారీగానే దరఖాస్తులను అందించారు. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు దశల వారీగా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు ఆరు గ్యారంటీలు అమలు చేయడానికి స్వీకరించిన ఈ దరఖాస్తులను ప్రభుత్వం ప్రత్యేక సిబ్బంది ద్వారా ఆన్‌లైన్ చేయించింది. ఈ క్రమంలో కంప్యూటర్ ఆపరేటర్‌లు చాలా చోట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆన్‌లైన్ పనిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. అయిన ఆన్‌లైన్‌లో నమోదు క్రమంలో పొరపాట్లు దొర్లాయి. దీంతో వేలాది మంది ఆరు సంక్షేమ పథకాల అమలుకు నోచుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాల సవరణకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. తప్పులు దొర్లిన దరఖాస్తులను సవరించేందుకు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యాలయాలు, మండల స్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, పట్టణాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ సేవ కేంద్రాల్లోనే సవరణకు అవకాశం కల్పించింది. దీంతో సవరణల కోసం దరఖాస్తు కేంద్రాలకు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఇంతలోనే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతో అప్పటి వరకు అంతంత మాత్రంగానే నడుస్తున్న ఈ ప్రక్రియ సైట్‌లు మూతపడ్డాయి. ఫలితంగా గృహజ్యోతి పథకం కింద నెలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కిందరూ.500 వంట గ్యాస్ పంపిణీ లబ్దిని అనేక మంది పొందలేకపోయారు. కాగా ఎన్నికల కోడ్ ముగియడంతో మూడు నెలల తర్వాత ప్రజాపాలన సైట్ తెరుచుకుంది.



కేంద్రాల వద్ద పడిగాపులు

బోధన్ పట్టణంలోని ఈ సేవ కేంద్రంలో చాలినంత సిబ్బంది లేకపోవడం, కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, ఒక్కో దరఖాస్తులోని తప్పులను సవరించడానికి చాలా సమయం పట్టింది. దీంతో దరఖాస్తుదారులు గంటల తరబడి ఈ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. చాలా సందర్భాల్లో సర్వర్లు పని చేయకపోవడం వల్ల ఈ సేవ కేంద్రాల్లో తప్పులను సరి చేయించుకోవడానికి వచ్చిన దరఖాస్తుదారులకు చుక్కలు కనిపించాయి. దీంతో విసుగుచెందిన అనేక మంది సవరణలు చేయించుకోకుండా వెనుదిరిగిన సందర్భాలు ఉన్నాయి.

అర్హులందరికీ అందించేందుకు కృషి..

: వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్, బోధన్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాల అమలుకు తగిన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దరఖాస్తుల సవరణలు నిలిచిపోయాయి. కోడ్ ముగియడంతో లబ్ధిదారులు తమ దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలి.

స్కూల్ బస్సులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

నందిపేట, జూన్ 24: బడిపిల్లలను రవాణా చేస్తున్న బస్సుల విషయంలో పాఠశాల యజమానులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ వివేకానంద రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐలమ్మ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలకు చెందిన నాలుగు బస్‌ల ను సీజ్ చేశారు. దీంతో విద్యార్థులను వేరే వాహనాల్లో పాఠశాలలకు తరలించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపొద్దని, అనుభవంలేని డ్రైవర్లను పెట్టుకోవద్దని కోరారు. అంతే కాకుండా కాలం చెల్లిన బస్‌లను నడుపుతూ బడి పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడోద్దని హితవు పలికారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రశ్నించే తల్లిదండ్రులు వాహనాల ఫిట్‌నెస్‌పై యజమానులను ప్రశ్నించాలని వివేకానంద రెడ్డి కోరారు. ఆర్టీవో అధికారుల అనుమతులు ఉంటేనే బస్‌లను రోడ్లపై నడపాలని ఆయన సూచించారు.



సీజ్ చేసిన బస్‌లతో ఆర్టీవో అధికారులు

'ప్రజావాణి'కి వినతుల వెల్లువ

నసురుల్లాబాద్, జూన్ 24: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పలు సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో 11 శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

లింగంపేట: తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. విచారణ జరిపి సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎంఈవో రామస్వామి, ఏవో అనిల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

మద్నూర్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమైనట్లు తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఇవ్వవచ్చని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, ఎంఈవో రాములు, ఏపీవో పద్మ, ఏపీఎం మనోహర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు హాజరయ్యారు.

భిక్కనూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సోమవారం తమ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ శివప్రసాద్ తెలిపారు. ప్రజావాణిలో బాగంగా భూ సమస్యలపై రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఆ మేరకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పశువైద్యాధికారి దేవేందర్, వ్యవసాయాధికారిణి రాధ, ఏపీఎం శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మండల ప్రజలు తమకు ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దర ఖాస్తు కూడ రాలేదని తెలిపారు.

ఎల్లారెడ్డి: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలోనే ప్రజావాణి ఉంటుందని, ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

సిద్దులగుట్టపై దత్తాత్రేయ పారాయణం



సిద్దులగుట్టపై దత్తత్రేయ పారాయణం చేస్తున్న యువకులు

పెర్కిట్, జూన్24: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శివాలయంలో భక్తులు, యువకులు సిదేశ్వరునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ పరిసర గ్రామాలకు చెందిన దాదాపు వందకు యువకులు దత్తాత్రేయ పారాయణంలో పాల్గొన్నారు. చుట్టు పక్కల నాలుగు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి సిద్దేశ్వరునికి దర్శించుకున్నారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకిసేవలో ఆర్మూర్ భజన మండలి సేవలో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. సిద్దులగుట్టపై విచ్చేసిన భక్తులకు కొండల మనోజ్‌రెడ్డి లక్ష్మీ పోచంపల్లి గ్రామానికి చెందిన వారి కుటుంబ సభ్యులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, కొడిగెల మల్లయ్య, హజారీ సతీష్, బోండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

జాన్కంపేటలో శాంతియుత నిరాహార దీక్ష



పెద్దవాగు సరిహద్దు విషయమై శాంతియుత నిరహర దీక్ష చేస్తున్న గ్రామస్థులు

వేల్పూర్, జూన్24: పెద్దవాగు సరిహద్దు చూపించడంలో తమకు న్యాయం చేయా లంటు వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామస్థులు సోమవారం గ్రామప్రధాన రహదారి పక్కన శాంతియుత నిరహర దీక్ష చేపట్టారు. గత కొన్నేళ్లుగా పెద్దవాగు సరిహద్దు విషయమై జాన్కంపేట్, పచ్చలనడ్కుడ గ్రామాల మధ్య వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. పెద్దవాగు విస్తీర్ణంలో వెంబడ ఉన్న ఇరు గ్రామాలకు ఏ విధంగానైతే ఆ గ్రామాల సరిహద్దులు ఇసుకను వాడుకుంటున్నారో అదే విధంగా తమ చిన్న గ్రామాల మాదిరిగానే న్యాయం చేయాలని అధికారులను జాన్కంపేట్ గ్రామస్థులు కోరుతున్నారు.ఇరుగ్రామాల వాగు సరిహద్దు విషయమై ఇటీవల అధికారులు తీసుకున్న నిర్ణయం వల్ల తమ గ్రామానికి అన్యాయం జరుగుతుందని, తమకు న్యాయం జరిగే వరకు తమ గ్రామప్రజలు శాంతియుత నిరహర దీక్ష కొనసాగిస్తామని జాన్కంపేట్ గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ నిరహర దీక్షలో గ్రామంలోని అన్ని సంఘాల ప్రజలు పాల్గొన్నారు.

నవీపేటలో పోస్టర్ల ఆవిష్కరణ



నవీపేటలో పోస్టర్ల ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవీపేట,జూన్24: మండల కేంద్రంలో సోమవారం కామ్రేడ్ డీవీ కృష్ణ స్మారక స్థూప ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా బోధన్ డివిజన్ కార్యదర్శి డీ.రాజేశ్వర్ మాట్లాడుతూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ 2వ వర్థంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్ రోడ్డు వద్ద ఈ నెల 26న స్మారక స్థూప ఆవిష్కరణ నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమానికి పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు హజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హన్మాండ్లు, సాయినాథ్, రాజేందర్, రవి తదితరులున్నారు.

కమ్మర్‌పల్లి: ప్రజాపంథ సిద్ధంత మార్గదర్శి కామ్రెడ్ డి వి కృష్ణ స్మారక స్తూపం ఆవిష్కరణ వర్ధంతి సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం కమ్మర్‌పల్లి పార్టీ కార్యాలయం తో పాటు వివిధ గ్రామాలలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు బి దేవారాం మాట్లాడుతు విప్లవోద్యమం పురోగతికి కొత్త ఎతుగడలు, పంథ కార్యక్రమ అవసరమని మొక్కవోని దీక్షతో పార్టీలోపల బయట పోరాడి బారతవిప్లవ పంథాకే మహావిప్లవనేతగా డికే నిలిచాడని కొనియాడారు. అవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ కమిటి సభ్యులు జి కిషన్, సత్తేక్క, పిడిఎస్‌యూ జిల్లా అద్యక్షుడు నరేందర్, పివైఎల్ నాయకుడు రమేష్, రాజాగైడ్ తధితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ప్రజాపంథ సిద్ధాంత రూప కర్త కామ్రేడ్ డీవీ కృష్ణ స్తూపం ఆవిష్కరణ కు పెద్ద సంఖ్యలో విప్లవ నాయకులు, కార్యకర్తలు జూన్ 26న నిజామాబాద్‌కు తరలి రావలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పేర్కొన్నారు. సోమవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. కామ్రేడ్ కృష్ణ నేటి తరానికి ఆదర్శమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాపంథ నాయకులు వెంకన్న, మురళి, మోహన్, పాల్గొన్నారు.

పెర్కిట్ పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ



సౌండ్ సిస్టం అందజేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, జూన్24: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో సోమవారం సౌండ్ సిస్టంను వితరణ చేశారు.ముఖ్యఅతిథిగా హాజరైన పీడీజీ హన్మంత్‌రెడ్డి సౌం డ్ సిస్టంను ప్రధానోపా .ధ్యాయుడు శ్రీనివాస్‌కు అందజేశారు. లింబాద్రిగౌడ్ సౌండ్ సిస్టంను స్పాన్సర్ చేశారు.ఈకార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపి కృష్ణ, కార్యదర్శి పట్వారి తులసీ, కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు పుష్పకర్‌రావు, ప్రవీన్‌పవార్, ఆనంద్, మా రుతి, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి ప్రధానోపాధ్యాయురాలిపై ఫిర్యాదు

ధర్పల్లి, జూన్ 24 :ధర్పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఘనజ్యోతిరాణిపై ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాఠశాలల్లో నూతనంగా నిర్మించిన తరగతి గదులతో పాటు భోజనశాల గదిని ప్రారంభించారు. అయితే ఈ గదులను ఆమె స్వాధీనం చేసుకుని వాడుకోక పోవడంతో విద్యార్థులు చెట్టు నీడ భోజనం చేయాస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఉపాధ్యాయులకు సైతం వేధింపులకు గురి చేయడంతో సెలవులపై వెళ్తున్నట్లు ఎమ్మెల్యేకు విన్నవించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

డిచ్‌పల్లి,జూన్ 24: గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రతి సోమవారం ప్రజా వాణిని నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సాయిలు తెలిపారు. సోమవారం ఏఈ కార్యాల యంలో ప్రజావాణి సందర్భంగా పలువురు విద్యుత్ స్తభాల కోసం విద్యుత్ మీటర్ల కోసం దరఖాస్తు పెట్టుకున్నట్లు ఏఈ తెలిపారు.

మూగజీవాలకు శాపంగా ట్రాన్స్‌ఫార్మర్లు

● కంచె లేక మృత్యువాత పడుతున్న జీవాలు

డొంకేశ్వర్, జూన్24: గ్రామాల్లో పంట పొలాల్లో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా ఉండే విద్యుత్ తీగల మూగజీవాలకు శాపంగా మారాయి.ఇళ్లలో నుంచి మేతకు వెళ్ళిన పశువులు సాయంత్రం తిరిగి వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతు న్నారు. జిల్లాలో నిత్యం ఏదోఒక చోట పశువులు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. పశువులకు ప్రమాదాలు సంభ వించడంతో అప్రమత్తత కరువై అదే మనుషులకు జరిగితే పరిణా మాలు వేరేగా ఉంటాయి. గడిచిన సంవత్సరంలో డొంకేశ్వర్ మండలం లోన్ని గ్రామాల్లో ఐదుకు పైగా పశువులు విద్యుదా ఘా దానికి గురై మృత్యువాత పడినట్లు అధికారుల ద్వారా తెలుస్తుంది. ఎన్ని జరిగిన ట్రాన్స్‌పార్మర్ వద్ద రక్షణ చర్యలు చేపట్టడంలేదని విమర్శలు ఉన్నాయి.

● రైతులకు ఆర్థిక భారం

అసలే గ్రామాల్లో పాడి సంపద అంతంత మా త్రంగా ఉంది. పశువులను సదా లేక పెంపకందారులు పశువులను అమ్మేసుకుంటు న్నారు. ఉన్న పశువులను పెంచుకునేందుకు ఇబ్బందులుపడుతున్నారు. గ్రామాల్లో భూములు సాగులోకి రావడంతో పశువుల స్థలం కొరత ఏర్పడింది.గతంలో గేదేల ధరలు తక్కువగా ఉండి ఇప్పుడు ఎక్కువగా ఉన్నాయి.ఒక గేదేని గ్రామాల్లో కొనాలన్న రూ.60 నుంచిలక్ష వరకు ఉం టుంది.దేశీ ఇతర జాతులు వాటి ధరలు ఇంక ఎక్కువ వేలాది రూపా యలు పెట్టి కొన్న గేదేలు విద్యుత్‌షాక్ తగిలి మరణిస్తుం డడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

● విద్యుత్ స్థలం నష్టపరిహారం

గత ప్రభుత్వం పశువులకు బీమా పథకాన్ని అమలు చేయగా ప్రస్తు తం అటువంటి పథకం ఏమి కొనసా గడంలేదు. విద్యుత్ షాక్‌కు గురై పశువులకు విద్యుత్ సంస్థ తరఫున రూ.40వేల వరకు పరిహారం అంది స్తున్నారు. నిబంధనలన్నింటిని పాటించి పత్రాలన్ని సమ ర్పిస్తే రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతుండడంతో పశువుల పెంపకందా రుల కు కొద్దిమేర ఆర్థికంగా తోడు లభిస్తుంది. పశువులు విద్యుత్‌షాక్‌తో మరణిస్తే ప్రదేశాన్ని విద్యుత్ అధికారులు నిర్ధారించాలి. అనంతరం గ్రా మపంచాయతీ నుంచి తీర్మాణం తీసుకోవాలి. వైద్యాధికారి పోస్టు మార్టం చేసి ధ్రువీకరణ అందజేయాలి. రైతుఆధార్ బ్యాంకు పాస్ బుక్ జత చేసి విద్యుత్ అధికారులకు పశువైద్యాధికారికి అందజేశారు. గ్రా మంలో సకాలంలో స్పందించి పనులన్ని పూర్తిచేస్తే సకాలంలో రైతుల ఖాతాలోనష్టపరిహారం జమఅవుతుంది.లేదంటేఅధికారులు చుట్టు ప్రదక్షిణలు చేయాల్సిందే.

● అప్రమత్తత అవసరం

పంట పొలాల్లో పాటు గ్రా మాల్లో విద్యుత్ పట్ల ప్ర జలు అప్రమత్తంగా ఉండాలని వేలాడే తీగలు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లపై విద్యు త్ శాఖ అధి కారులకు ముం దస్తు సమా చారం అందిస్తే ప్ర మా దంను నివారించేందుకు అవ కాశం ఉంటుంది. పశు వులపెంచే పెంపకందారులు ప్రమాదవ శాత్తు ఉన్న ప్ర దేశా లవైపు పశువులను తీసుకు వెళ్ళిపోవడం మంచిది.



మృతి చెందిన గేదే (ఫైల్‌ఫొటో)

● జరిగిన సంఘటనలకు వచ్చిన ఆర్థిక సహాయం

మండలంలో ఇప్పటి వరకు గత సంవత్సరంలో మూడు గే దేల వరకు మృతి చెందాయి. మృతి చెందిన రైతు కుటుంబా నికి ఒక్కో గేదే కు విద్యుత్ శాఖ తరఫున రూ.40వేల ఆర్థిక సహ యం ఇప్పటి వరకు అందింది. డొంకేశ్వర్‌మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన లోక రవి, దత్తా పూర్‌కు చెందిన మూడ రేణుక, తొండాకూర్ లో జెల్ల నడ్పి రాజన్న, గాదేపల్లికి గ్రామంలో ఎర్త్‌వైర్ తగిలి మృతి చెందింది.

కంచె ఏర్పాటు చేయాలి



గత రెండు రోజుల క్రితం గ్రామంలో ఉన్న విద్యుత్ టాన్సాఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్‌వైర్‌కు విద్యుత్ సరఫరా అయింది. గెదే మృతి చెందింది. తక్కువ ఎత్తు ఉన్న విద్యుత్ టాన్స్‌ఫార్మర్ వద్ద కంచె ఏర్పాటు చేస్తే ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. వెంటనే విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- సింగిడి నర్సారెడ్డి, గాదేపల్లి

రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

నందిపేట, జూన్24: మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఎన్నిల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని రాష్ట్ర కేబినెట్‌లో తీర్మాణం చేయడంతో పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలను ఒక్కొక్కటిగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, సీఎం అందుకు సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు. 100 రోజుల పాలన బేష్‌గా ఉందని సీఎం రేవంత్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, కిసాన్ సెల్ అధ్యక్షులు దమ్మాయి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గంగారెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, ఐలాపూర్ సోసైటీ మాజీ చైర్మెన్ లక్ష్మీనారాయణ, ఉమ్మెడ మాజీ సర్పంచ్ పోశెట్టి, నాయకులు గంగాధర్, దూడ వెంకటేష్, ఎడ్డిగారి నిఖిల్,మైనార్టీ నాయకులు యూసుఫ్,తధితరులు ఉన్నారు.

బోధన్‌రూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు 2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ వచ్చిందని, రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గంగాశంకర్, అల్లె రమేష్, గణపతి రెడ్డి, చీల శంకర్, పెంటాఖుర్దు గ్రామస్థులు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నందిపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

మత్తడివాగులో దూసుకెళ్లిన కారు

● ఒకరి మృతి



రమేష్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

వేల్పూర్, జూన్24: వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామ శివారులో సోమవారం ఎస్సారెస్పీ వరదకాలువపై అదుపుతప్పి కింద ఉన్న మత్తడివాగు నీటిలో ప్రమాదవశాత్తు కారు పడిపోయింది. ఈ ఘటనలో పడిగెల గ్రామానికి చెందిన గాదేపల్లి రమేష్(55) నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. మృతుడు రమేష్ తన కారులో మోటర్‌ను, కూలీలను తీసుకొని పోచంపల్లి శివారులో తన పొలం వద్దకు వెళ్లాడు కూలీలను, మోటర్‌ను బండారాయి మత్తడి వద్ద దింపాడు. తిరిగి గ్రామానికి వెళ్లేందుకు అక్కడ ఉన్న వరద కాలువపై పెట్టిన తన కారు సిఫ్ట్ డిజర్‌ను రివర్స్ తీస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి మత్తడి నీటిలో పడిపోయింది. దీంతో కారుతో పాటు కారు లోపల ఉన్న రమేష్ నీటిలో మునిగిపోయాడు. అక్కడ ఉన్న కొందరు 100నెంబర్‌కు ఫోన్ చేయగా పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని చేపలు పడుతున్న గూండ్ల వారి కొందరి సహకారం కారును మత్తడి నుంచి బయటకు తీసి చూడగా కారులో రమేష్ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని చూసిన భార్య, పిల్లలు, కుటుంబసభ్యులు విలపించిన తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించాయి. మృతునికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య యమున ఫిర్యాదు మేరకు కేస నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

కార్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

వర్ని,జూన్24: చందూర్ మండల శివారులో సోమవారం తెల్లవారుజామున రెండు కార్లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తున్న కొత్తోళ్ల శ్రీనివాస్ దంపతులు ఐదు నిమిషాల్లో ఇంటికి చేరే క్రమంలో పిట్లం మండలం నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు వీరి కారును ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరి కాళ్లు విరిగి గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.

ఇస్లాంపురలో చోరీ

● 65వేల నగదు .. 25వేల రూ.దుస్తులు చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై మహేశ్

డిచ్‌పల్లి,జూన్ 24: మండల కేంద్రంలోని ఇస్లాంపూర కాలనీలో గుర్తు తెలియని దొంగలు మగ్బుల్ ఇంటి తాళాలు ధ్వంసం చేసి సోమవారం తెల్లవారు జామున బీరువాలో ఉన్న 65వేల నగదు , 25వేల రూ.దుస్తులు చోరీ కి గురయ్యాన్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. వారంత ఇస్లాంపుర కాలనీలో వివాహ కార్యక్రమంలో పాల్గొనేం దుకు వెళ్లగా దొంగలు ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తుంది. డిచ్‌పల్లి పోలీసులు ఘటన స్థలిని సందర్శించారు. క్లూస్ టీం నిపుణులు వేలిముద్రలను సేకరించారు. ఎస్సై మహేశ్, ఘటన స్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు.

అక్రమ ఇసుక సీజ్



ఇసుకను సీజ్ చేసిన దృశ్యం

రెంజల్,జూన్24: మండలంలోని బోర్గాం గ్రామ శివారులో అక్రమంగా డంప్ చేసిన సుమారు వెయ్యి ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తెలిపారు. బోర్గాం శివారులో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పోలీసు సిబ్బందితో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తెలిపారు.

‘బీసీల ఉన్నతికి కృషి చేసిన స్వర్గీయ అర్గుల్ రాజారాం’

ఆర్మూర్‌రూరల్, జూన్24: ప్రముఖ సోషలిస్టు నాయకులు స్వర్గీయ అర్గుల్ రాజారాం బీసీల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో అర్గుల్ రాజారాం శతజయంతిని పురస్కరించుకొని అర్గుల్ రాజారాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వర్గీయ అర్గుల్ రాజారాం జయప్రకాష్‌నారాయణ శిష్యుడిగా కొనసాగుతూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడ్డాడన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా, విద్యుత్ శాఖ మంత్రిగా పని చేసి రాజకీయ నాయకులకు ఆదర్శ ప్రాయుడిగా నిలిచారని కొనియాడారు. వివిధ పార్టీలలో ఉన్న నాయకులు స్వర్గీయ అర్గుల్ రాజారాంను ఆదర్శంగా తీసుకొని బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రొయ్యడి రాజేశ్వర్, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామియాదవ్, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు ఉదయ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అర్గుల్ రాజారాం కుటుంబసభ్యులు, జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు గోర్త రాజేందర్ అర్గుల్ రాజారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఎమ్మార్పీఎస్ నాయకులు మైలారాం బాలు అర్గుల్ రాజారాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న బీసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి బీసీ కులగణన చేపట్టేలా ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.



అర్గుల్ రాజారాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న యెండల

టీయూలో హాస్టళ్ల తనిఖీ



టీయూ బాలికల, బాలుర హాస్టల్స్‌ను తనిఖీ చేస్తున్న చీఫ్ వార్డెన్

డిచ్‌పల్లి,జూన్ 24: తెలంగాణ విశ్వవిద్యాలయం లోని బాలికల , న్యూబాలుర, ఓల్డ్ బాలుర హస్టళ్లను టీయూ చీఫ్‌వార్డెన్ చీఫ్ వార్డెన్ సోమవారం తనిఖీ చేశారు. మెస్ కమిటీలో పనిచేస్తున్న సిబ్బందిని నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. పరిసరాలను ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తాజా సరుకు లను వంటకు ఉపయోగించాలని వర్కర్స్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం కొనుగోళ్లు చేస్తున్న దుకాణాన్ని మార్చి వేరే దుకాణాలనుంచి కొనుగోళ్లు చేయాలని ఆయన సూచించారు.

సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ చేయించాలి



కొండూర్ విలేఖర్లతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే

సిరికొండ జూన్ 24 :నీట్, యూజీసీ ప్రశ్న పత్రాల లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామ పరిదిలోని కప్పలవాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. కొండూర్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రాసే పరీక్షలు నీట్, యూజీసీ పత్రాల లీకైన ప్రధాని నరేంద్రమోదీ స్పందించక పోవడం బాధకరమన్నారు. ఆతీయ టెస్టింగ్ ఎజెన్సీ అధికారిని తొలగించి చేతులు దులుపుకోవడం కాదు సంబంధిత విద్యాశాఖ మంత్రిని రాజీనామ చేయించాలని ఎమ్మెల్యే ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. సీబీఐ కేంద్ర ప్రభుత్వ అజామాయిషీ ఉండే సంస్థ కావడం వల్ల దానిపై దర్యాప్తు చేయడం మాకు ఆ సంస్థపై నమ్మకం లేదన్నారు.ప్రశ్న పత్రాల లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ చేయాలని ఆయన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఏక కాలంలో రైతుల పంట రుణాలను రూ. రెండులక్షల వరకు మాపీ చేయడం రైతుల పట్ల మాకున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. 32వే కోట్ల రుణాలను దేశంలో ఏ ప్రభుత్వం ఇప్పటి వరకు మాపీ చేయలేదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రైతు బరోస కాని, రుణ మాపీ కాని అర్హులైన, పంటలు సాగుచేసే రైతులకు చెల్లిస్తామన్నారు. పెద్ద రైతులకు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌ల్లాంటి అధికారాలు, వెంచర్లకు రైతు బరోస చెల్లించేది లేదన్నారు. రుణ మాఫీకి సంబంధించిన గైడ్‌లైన్‌ను ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. గడ్కోల్, వాడి, పాటి తండాల వద్ద నిర్మిస్తున్న వంతెనల పనులను నాణ్యతగా, వేగంగా నిర్మిస్తున్నారని ఆయన చెప్పారు. గడ్కోల్ వద్ద పనులు కాస్త నెమ్మదిగా జరుగుతున్నందున వేగం పెంచాలని రోడ్డు భవనాల శాఖ అధికారులను ఆదేశించడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షులు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి, జిల్లా నాయకులు ఎర్రన్న,బాస్కర్‌రెడ్డి, ముప్పా గంగారెడ్డి, శేఖర్‌గౌడ్,నరేష్, రాజరెడ్డి,సురేష్,లింగారెడ్డి,చందర్, రూప్‌సింగ్ రాంరెడ్డి,సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించండి

సిరికొండ, జూన్ 24: వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి అయ్యేల చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి రోడ్డు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. సిరికొండ మండలం గడ్కోల్ వద్ద గల కప్పల వాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ డీఈ సుధీర్ ఎమ్మెల్యేకు పనులు జరుగుతున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు కాస్త నెమ్మదిగా జరుగుతున్నాయన్నారు. వర్షాలు గురిస్తే ఇక్కడి ప్రజలకు, రైతులకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారని అధికారుల దృష్టికి తీసికెళ్లారు. పనుల వేగాన్ని పెంచాలని ఎమ్మెల్యే అధికారులకు,సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.ఆయన వెంట ఏఈ మనోహర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రన్న, బాస్కర్‌రెడ్డి, రవి,జీవన్, నర్సారెడ్డి, నర్సింగ్‌సాయన్న,రాజరెడ్డి, సంజీవ్,గోవర్ధన్, జీవన్,దశరత్,మహిపాల్, సురేష్ తదితరులు ఉన్నారు



వంతెన నిర్మాణ పనుల గురించి ఎమ్మెల్యే వివరిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ సుధీర్

నాలుగు వ్యవసాయ మోటార్లు చోరీ

నవీపేట,జూన్24: మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధిలోని లక్ష్మి కిసాన్ ఫారం శివారులో ఉన్న నాలుగు వ్యవసాయ మోటార్లు ఆదివారం రాత్రి చోరీకి గురయ్యాయని స్థానికులు తెలిపారు. స్థానిక అలీసాగర్ కాలువలో నుండి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాలకు నీరు పారించడానికి మోటార్లను ఏర్పాటు చేసుకోగా ఇందులో నుండి నాలుగు మోటార్లు గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని వారు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు 1.20లక్షల ఉంటుందని వారు పేర్కొన్నారు. మోటార్ల చోరీ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలి

కోటగిరి,జూన్24: అమ్మ ఆదర్శ పాఠశాల పనులను కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని హంగర్గ ఫారం, చేతన్ నగర్, కారేగాం, సుంకిని పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. తాగునీరు, విద్యుత్, టాయిలెట్ల సమస్యలను పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో నాగనాథ్, మాజీ సర్పంచ్ మాధవరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

బోధన్‌రూరల్,జూన్24: 3 నుండి 6సంవత్సరాల లోపు పిల్లలకు నూతన విద్య విధానంపై బోధించడానికి బోధన్ ప్రాజెక్టులోని అంగన్‌వాడీ టీచర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో జానకి మాట్లాడుతూ నూతన విద్య విధానంపై చిన్నారులకు ఎలా బోధించాలో ఈ శిక్షణ ద్వారా అందించబడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఎంపీవో మధుకర్, మాస్టర్ ట్రైనర్ ఆసియా బేగం, రాధ, లక్ష్మి, సూపర్‌వైజర్‌లు రాధిక, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి

బోధన్‌రూరల్,జూన్24: వికలాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. సోమవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు 4వేల నుండి 6వేల పింఛన్, అత్తకోడళ్లకు పింఛన్‌లు, పింఛన్‌లు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని, ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా ప్రకటించకపోవడం సరికాదన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో వికలాంగుల రాష్ట్రస్థాయి సమావేశంలో ఉంటుందని అధిక సంఖ్యలో హజరైన విజయవంతం చేయాలని కోరారు.

రోడ్లపై కేజీవీల్స్ నడిపితే చర్యలు

నవీపేట,జూన్24: మండలంలోని అన్ని గ్రామాలలో బీటీ, సీసీ రోడ్లపై కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లను నడిపితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీవో రామకృష్ణ తెలిపారు. కేజీవీల్స్ ట్రాక్టర్లకు పట్టీలు అమర్చుకుని నడపాలని, లేనట్లయితే రూ.5వేల జరిమాన విధించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



వంతెన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి, జూన్ 24 :వాడివాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సంబంధిత శాఖాధికారులకు సూచించారు. సోమవారం వాడివాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీంచారు. పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షకాలం ప్రారంభమైన ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మాణం సకాలంలో పూర్తి కాకపోతే ప్రజలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈసందర్భంగా అక్కడికి వచ్చిన రైతులు వాగు నిర్మాణ పనుల గతంలో కంటే వెడల్పు కావడంతో తమ వ్యవసాయ భూముల్లోకి వరద నీరు వచ్చే చేరే అవకాశం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే రైతులకు ఎలాంటి నష్టం జరుగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజు,గాధారి మనోహర్‌రెడ్డి,మిట్టపల్లి గంగారెడ్డి, బేల్దారీ కృష్ణ,మిట్టపల్లి ప్రవీణ్‌రెడ్డి,వీడీసీ ఛైర్మన్ అర్గుల్ రాజేశ్వర్‌రెడ్డి, వాడి మాజీ సర్పంచ్ భాగవ్వ, గంగారెడ్డి, చెలిమెల శ్రీనివాస్, భగవాన్‌రెడ్డి శ్రీధర్ గౌడ్, బొక్కల బాలయ్య, తదితరులు ఉన్నారు. అనంతరం హోన్నాజీపేటలో పార్టీకి చెందిన బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

సకాలంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, జూన్ 24: బ్రిడ్జి నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం ఇందల్వాయి నుంచి ధర్పల్లి వెళ్లే రోడ్డులో రహదారిపై వెంగల్‌పాడ్ వద్ద నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు కేటాయించిందని పనులు చక చకా జరుగుతున్నాయని అన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే ఈ వర్షాకాలం పూర్తయిన తర్వాత లింగాపూర్ వద్ద ఉన్న వంతెనపై హైలెవల్ బ్రిడ్జి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. మంచి నాణ్యతతో పనులు జరిగేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, డీసీసీబీ డెలిగేట్ వెంకట్‌రెడ్డి, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడిగోపి, చింతల కిషన్, రాజేందర్, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, తహసీల్దార్ వెంకట్రావ్, తదితరులు ఉన్నారు.

డైట్ ప్రిన్సిపల్ అక్రమాలపై విచారణకు ఆదేశం

నిజామాబాద్ అర్బన్, జూన్24:డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌పై వచ్చిన ఆరోపణలపై కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న శ్రీనివాస్‌పై విద్యార్థి సంఘాలు, విద్యార్థులు అనేకమార్లు ప్రజావాణిలో ఫిర్యాదులు చేశారు.విద్యార్థుల పట్ల ఆయన వైఖరితో పాటు డైట్ కళాశాలలో అనేక అక్రమాలు జరిగినట్లు విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు విద్యాశాఖ కమీషనర్ వరంగల్ ఆర్‌జెడికి విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ఒకరి మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్24: బోధన్ పట్టణం పెంటాఖుర్దు గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో రాములు(50)అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. క్షతగాత్రులను నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బోధన్ సీఐ వీరయ్య తెలిపిన ప్రకారం బోధన్ నుండి కోటగిరికి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై రాములు, మారమ్మ, సాదుల్లా భార్యభర్త, కొడుకులు ఒకే ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చెక్కిక్యాంప్ గ్రామానికి చెందిన రాజయ్య, గంగారాంలు ఎదురుగా రావడంతో ప్రమాదవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టాయన్నారు. ఈ ఘటనలో రాములు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం 108లో జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

మంత్రిని కలిసిన మోస్రా నాయకులు

మోస్రా,జూన్24: మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహను మర్యాదపూర్వకంగా కలిసి మండలంలోని పలు సమస్యలు అడిగి తెలియజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు పోచయ్య, ఉపాధ్యక్షుడు వినాయక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న అధికారులు



కలెక్టరేట్‌కు వచ్చిన విద్యార్థి సంఘాల నాయకులు



ధర్నా చేస్తున్న కార్మికులు

● కలెక్టరేట్‌లో బారులు తీరిన ఫిర్యాదుదారులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 24: ప్రజల సమస్యల పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈవారం వినతులు వెల్లువలా వచ్చాయి. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అదనపు కలెక్టర్‌లు కిరణ్‌కుమార్, అంకిత్, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 164 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ సత్వరమే ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్‌డీవో సాయాగౌడ్‌లు వినతులు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

● అజ్మీర రాంజీ మృతికి సంతాపం

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీర రాంజీ అకాల మరణంపై జిల్లా యంత్రాంగం, టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా నివాళులర్పించారు. అజ్మీరా రాంజీ చిత్రపటానికి అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

● ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే వేతనాలు అందడం లేదు

లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్ బకాయిలు చెల్లించడం లేదని రెండేళ్లుగా నెలనెల వేతనాలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఎం ఆధ్వర్యంలోసోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. సకాలంలో పీఎఫ్, ఈఎస్ఐ కూడా కట్టడం లేదని కార్మికులు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని కావున వారికి వేతనాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి, కార్మికులు కోరారు.

● మెగా డీఎస్సీని ప్రకటించాలి

ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీని ప్రకటించాలని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. డీవీఎం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాంల ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులు మరియు నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని మెగా డీఎస్సీని ప్రకటించి, సెప్టెంబర్‌లో డీఎస్సీని నిర్వహించాలని టీచర్ల బదిలీలు, పదోన్నతులతో ఖాళీ అయిన పోస్టులను డీఎస్సీతో భర్తీ చేయాలని, గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలని కొత్తగా టెట్ ఉత్తీర్ణత సాధించిన వారికి డీఎస్సీ పరీక్ష రాయడానికి అవకాశం కల్పించాలని కోరారు.

● కళాశాలల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలి

జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ప్రైవేటు కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. 2021-22, 2022-23,2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల కళాశాలల నిర్వహణ భారంగా మారిందని గత ఏడాది కొన్ని నిధులు విడుదల చేసి ట్రెజరీద్వారా టోకెన్‌లుఇచ్చిన ఆటోకెన్‌లకు డబ్బులు విడుదలకాలేవన్నా రు. కళాశాలల నిర్వహణ కోసంఅప్పులు చేసివడ్డీలు, జీతాలు ఇస్తున్నామని మా పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు.

● కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గ్రామ పంచాయతీ, మున్సిపల్, బీవోసీ, హమాలీ, కేజీబీవీ, బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భూమన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. బీడీ కార్మికులకు 4వేల జీవనభృతి వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సూర్యశివాజీ, ఖాజామోయినొద్దీన్, శివకుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో జూడాల సమ్మె



సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు

పెద్దబజార్, జూన్ 24: ఈనెల 24 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జూడాల సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల ఎదుట ఓపి సేవలు, ఓటి సేవలను తాత్కాలికంగా బహిష్కరించి జూనియర్ డాక్టర్లు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జూడాల నేతృత్వంలో ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిందని నెలనెల ఉపకార వేతనాలు చెల్లించడమే కాకుండా దీర్ఘకాలికంగా ఉన్న ఇతర సమస్యలను పరిష్కరించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు లేవని ప్రభుత్వం నుంచి వచ్చే నెలనెల ఉపకార వేతనం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ ఛానల్ స్టైఫండ్‌ల క్రమబద్ధీకరణపై జీవో విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కాకతీయ మెడికల్ కళాశాలలో రోడ్లు వేయాలని, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి కోసం కొత్త భవనం నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ ఆసుపత్రిలో తగిన భద్రత విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు. వివిధ ప్రభుత్వ మెడికల్ కళాశాలల కొత్త హాస్టల్స్ వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకొని హాస్టల్ వసతులు కల్పించాలని సూచించారు. తెలంగాణలో ఏపీ విద్యార్థులకు 15 శాతం సీట్లు రిజర్వేషన్ల తొలగింపు ప్రత్యమ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. సూపర్ స్పెషాలిటీ సినియర్ రెసిడెంట్లకు గౌరవవేతనం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో జీజీహెచ్ జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

● జూడాల సమ్మె నేపథ్యంలో ప్రత్యమ్నాయ ఏర్పాట్లు

తమ డిమాండ్ల సాధన కోసం సోమవారం నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మెతో పిలుపునిచ్చన నేపథ్యంలో ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ నాగమోహన్ తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవల్లో ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అందరు వైద్యుల సెలవులు రద్దు చేశామన్నారు. అలాగే అసిస్టెంట్, అసోసియేషన్ ప్రొఫెసర్లు, హౌస్ సర్జన్‌లు, పీజీ విద్యార్థులు విధులు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు.

ఏసీపీని కలిసిన ట్రస్మా ప్రతినిధులు



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న ట్రస్మా ప్రతినిధులు

నిజామాబాద్‌అర్బన్,జూన్ 24: ప్రైవేటు పాఠశాలలపై విద్యార్థి సంఘాల దాడుల నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్ (ట్రస్మా) ప్రతినిధులు సోమవారం ఏసీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు నగరంలోని ఓ హోటల్‌లో ట్రస్మా ప్రతినిధులు సమావేశమయ్యారు. జిల్లా వ్యాప్తంగా 80 మంది ప్రతినిధులు ఈసమావేశంలో పాల్గొని విద్యార్థి సంఘాల దాడుల పై చర్చించి సమిష్టిగా తీర్మానం చేసి ఏసీ పీని కలిశారు.విద్యార్థి సంఘాల దాడుల నుంచి పాఠశాలలను కాపాడాలని కోరారు. దానికి సానుకూలంగా స్పందించిన ఏసీపీ అపరిచిత వ్యక్తులు, విద్యార్థి సంఘాల నాయకులు ఎవరైనా పాఠశాలలపై దాడి చేసినట్లయితే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తద్వారా చట్టరిత్యా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నిత్యానందం మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలపై విద్యార్థి సంఘాలు దాడులు చే స్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పాఠశాలల నిర్వహణ కష్టతరంగా మారిన ప్రస్తుత తరుణంలో బడ్జెట్ స్కూళ్ల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతుందని దానికితోడు విద్యార్థి సంఘాల ఒత్తిళ్లతో తాము ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, కోశాధికారి మధు, పట్టణ అధ్యక్షుడు ధర్మరాజు,మురళికృష్ణ,శ్రీనివాస్,నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు పాల్గొనాలి

డిచ్‌పల్లి,జూన్ 24:రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నేడు మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో (వర్చువల్ వేదిక) రైతులు అధిక సంఖ్యలో పాల్గొనలని రైతు భరోసా మొదలైన అంశాలపై రైతులతో మాట్లాడు తారని వ్యవసాయాధికారి రాంబాబు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి



మృతి చెందిన బాలాజీ

జక్రాన్‌పల్లి, జూన్ 24: కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం తలవత్‌పూర్ గ్రామానికి చెందిన దండల్‌వార్ బాలాజీ అనుమానస్పదంగా మృతి చెందినట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు.ఎస్సై సీహెచ్ .తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం తలవత్‌పూర్ గ్రామానికి చెందిన దండల్‌వార్ బాలాజీ(37) కుటుంబసభ్యులు ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో నివాసముంటున్నారు.అంకాపూర్ గ్రామానికి చెందిన పడకంటి చిన్నారెడ్డి వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని పంటలు పండించుకుంటున్నాడని వివరించారు. ఆదివారం మధ్యాహ్నం బాలాజీ కౌలుకు చేస్తున్న పొలం పనులు చేసేందుకు వెళ్లాడు. రాత్రి అయిన బాలాజీ ఇంటికి రాకపోవడంతో తమ్ముడు ప్రకాష్ పొలం వద్దకు వెళ్ళి వేతగా బాలాజీ చనిపోయి ఉన్నాడని చెప్పారన్నారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సోమవారం మృతుడి భార్య శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలాజీ అనుమానస్పదంగా మృతి చెందినట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

టీయూలో డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన



టీయూ సెంట్రల్ లైబ్రరి వద్ద డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

డిచ్‌పల్లి,జూన్24: వర్సిటీ సెంట్రల్ లైబ్రరి వద్ద సోమవారం ఉపాధ్యాయులు బదిలీలు పదోన్నతుల ద్వార ఏర్పాడిన ఖాళీలను ప్రస్తుత డీఎస్సీలో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తు ప్లాకార్డులు పట్టుకొని డీఎస్సీ ఆదోళన చేశారు. ఈసందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల వల్ల ఏర్పాడిన ఖాళీలను ఈ డీఎస్సీ లో ప్రకటించినపోస్టులకు కలుపాలని డిమాండ్ చేశారు.డీఎస్సీ పరీక్షను వాయిదా వేసి ప్రిపరేషర్ 2నెలలు గడువు ఇవ్వాలని కోరారు.ఈ విద్యాసంవత్సరం బీఈడీ,డీఈడీ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సైతం డీఎస్సీరాసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులుశ్రీను నాయక్, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యంలో పురుగులు



మద్దెపల్లి మధ్యాహ్న భోజన బియ్యంలో వచ్చిన తెల్ల పురుగులు

నవీపేట,జూన్24: మండలంలోని మద్దెపల్లి యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంకు సంబంధించిన బియ్యంలో సోమవారం తెల్ల పురుగులు బయట పడ్డాయి. వేసవి సెలవుల అనంతరం ఇటీవల పాఠశాలకు బియ్యం సరఫరా కాగా అందులో తెల్ల పురుగులు ఉన్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ తెలిపారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు చాటతో బియ్యాన్ని చేరగగా తెల్లపురుగులు బయట పడ్డాయని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావును వివరణ కోరగా మద్దెపల్లి యూపీఎస్ పాఠశాల మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యంలో తెల్ల పురుగులు బయట పడ్డ విషయం తమ దృష్టికి వచ్చిందని వెంటనే సంబంధిత బియ్యాన్ని మారుస్తామని ఆయన పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ రైలును పునరుద్ధరించాలి



రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

బోధన్‌రూరల్,జూన్24: బోధన్ పట్టణం రాకాసిపేట రైల్వే స్టేషన్ నుంచి మహబూబ్‌నగర్ ప్యాసింజర్ రైలును బ్లాక్ సెక్షన్ పేరుతో గత మూడు నెలలుగా రైలు రద్దు చేయడం సమంజసం కాదని వెంటనే బోధన్ నుంచి రైలును పునరుద్ధరించాలని విద్యార్థి జేఏసీ నాయకులు రైల్వే మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు బోధన్‌ను సందర్శించిన నాయకులు రైల్వే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారన్నారు. బోధన్ టు కరీంనగర్ రైలు రద్దు అయి మూడు నెలలు గడుస్తున్న రాజకీయ నాయకులు నోరు మెదపకపోవడం సరికాదన్నారు. బోధన్ నుంచి రైలు లేక ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వెంటనే బోధన్ నుంచి వెళ్లే రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు జునేత్, హైమద్, కలీల్, రాంచందర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి ముస్లిం సోదరుడి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

రుద్రూరు, జూన్ 24 : రుద్రూరు మండల కేంద్రంలోని శ్రీరామ మందిర పునః నిర్మా ణానికి సోమవారం రుద్రూరు నివాసి ముస్లీం సోదరుడు, మటన్ షాప్ యజమాని మహ్మద్ ఇమాన్ తనవంతు సహాయంగా రూ. 18,006/- విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు పత్తి రాము, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72700	రూ.67,000	రూ.920

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మహారాజ (11.05, 4.30, 7.35, 10.40)
: మరణం (2.10)
స్క్రీన్-2 : ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (11.30, 5.05)
: మనమే (1.45)
: జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ (హిందీ) (7.25)
: ముంజియా (హిందీ) (10.35)
స్క్రీన్-3 : సందేహం (11.20)
: హనీమూన్ ఎక్స్‌ప్రెస్ (2.00)
: హరోం హర (4.40)
: ఓ మంచి గోస్ట్ (7.55)
: చందూ ఛాంపియన్ (హిందీ) (10.40)
స్క్రీన్-4 : నిందా (2.20, 7.50)
: ప్రభుత్వ జూనియర్ కళాశాల (5.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మహారాజ (1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2 : ఓ మంచి గోస్ట్ (11.10, 4.35)
: ప్రభుత్వ జూనియర్ కళాశాల (1.40)
: నింద (7.30, 10.25)
స్క్రీన్-3 : మనమే (1.40, 4.45, 10.35)
: సందేహం (7.45)

దేవి : మహారాజ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: చందు ఛాంపియన్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : నింద (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్